
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం ၊ 27 ၊ జూలై ၊ 2025



10,151 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయంలో శనివారానికి 28.888 టీఎంసీలు ఉన్నాయి. ఎగువప్రాంతం నుంచి 10,151 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,01,240
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,160
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,435
సవర (8 గ్రాములు)	రూ.75,480

గరిష్టం/కనిష్టం
34.8 /27.9

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. శనివారం గాలిలో తేమ 55 శాతంగా నమోదైంది.

పచ్చని పల్లెకు మైనింగ్ ఉరి

ఒకప్పుడు పచ్చటి పంటలు, పాడి పశువులతో కళకళలాడిన జంగంరెడ్డిపల్లి.. నేడు బతుకు కోసం పోరాడుతోంది. ఆ ఊరుకు కూతవేటు దూరంలోని కొండ (తిప్ప) ప్రాంతంలో అత్యంత విలువైన ఖనిజ సంపద ఉంది. దీన్ని కొల్లగొట్టేందుకు కొందరు అక్రమార్కుల కన్ను ఈ తిప్పపై పడింది. పంట భూములు లేని ఆ ఊరికి జీవానాధారమైన కొండ ప్రాంతమే బతుకు మూలం. పశువులు, జీవాల పోషణ ఆధారంగా సాగే జీవనాధారాన్ని దెబ్బతీసేందుకు కూటమి ప్రభుత్వంతోపాటు అధికార యంత్రాంగం సైతం నిర్ద్వందంగా వ్యవహరిస్తున్నారు. తమకింత విషమించి చంపేసి తమ శవాల మీద వెళ్లి మైనింగ్ చేసుకోమని గ్రామస్తులు ద్రవించిన హృదయాలతో తెగేసి చెప్పినా అధికార యంత్రాంగం నిర్దయగా ముందుకెళ్తోంది.

ఆ ఊరుకు అనుకొని ఉన్న పళ్ల తిప్పకు ఎసరు

- కొండ(తిప్ప)లో రూ.కోట్లు విలువ చేసే ఖనిజ సంపద
- తిప్పే ఆ పల్లెకు జీవనాధారం
- పేద జనం గోడు పట్టించుకోని అధికారులు
- అధికార పార్టీ నేతల ప్రమేయంపై జనాగ్రహం
- ప్రజాభిప్రాయ సేకరణ సభలో జనాల నిర్ణయానికి విలువేది?



జంగంరెడ్డిపల్లి గ్రామస్తులకు జీవనాధారమైన తిప్ప



తిప్పను ఆనుకొని ఉన్న గ్రామం వ్యూ

ఉదయగిరి: వరికుంటపాడు మండల కేంద్రానికి కూతవేటు దూరంలో జంగంరెడ్డిపల్లి ఉంది. నాలుగున్నర దశాబ్దాల క్రితం అది ఒక సంపన్నమైన పల్లె. ఎంతో మంది శ్రీమంతులు, అన్నీ కులాలు, వృత్తులు వారితో పచ్చని పైర్లు, పాడి పశువులు, జీవాలతో 200కు పైగా కుటుంబాలతో ఆ పల్లె కళకళలాడుతూ ఉండేది. కాలక్రమేణా కాలం కలిసి రాలేదు. పాడి పంటలు మృగ్యమయ్యాయి. దీంతో అనేక కుటుంబాలు పొట్ట చేత పట్టుకొని ఉపాధి కోసం ఊరు విడిచారు. 1990 దశకం నాటికి ఆ ఊరు దాదాపు ఖాళీ అయింది. ఆ పల్లెకు జీవనాధారంగా ఉన్న పళ్ల తిప్పను నమ్ముకొని కొన్ని ఎస్సీ కుటుంబాలు మాత్రం ఊరు మీద మమకారంతో అక్కడే ఉన్నాయి. ఆ తిప్పే ఆధారంగా నేటికి 40 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరితో పాటు భాస్కరపురం, వరికుంటపాడు గ్రామాలకు చెందిన పశువులు, జీవాలకు ఇదే తిప్ప ఆధారం. ఆ తిప్పలో రూ.కోట్లు విలువ చేసే ఖనిజ సంపద దాగి ఉన్న విషయం గ్రహించిన మైనింగ్ కంపెనీ యజమాని పోచ వెంకటరెడ్డి గ్రామస్తులకు తెలియకుండా రహస్యంగా 41 ఎకరాలు (16.7 హెక్టార్లు) భూమికి మైనింగ్ అనుమతులు తెచ్చుకున్నారు.

గతంలో ప్రతిఘటించడంతో..

పళ్ల తిప్పలో మైనింగ్ అనుమతులు పొందిన యజమాని వెంకటరెడ్డి 2024 డిసెంబరులో భూమిని చదును చేసి కంచె ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారు. దీంతో గ్రామ జనం తీవ్రంగా ప్రతిఘటించడంతో వారు పోలీసు, రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. వారి ద్వారా గ్రామసభ ఏర్పాటు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో మైనింగ్ కంపెనీ యాజమాన్యం వెనుదిరిగింది. కొంత కాలంగా మౌనంగా ఉన్న ఆ కంపెనీ యాజమాన్యం ఒక్కసారిగా గురువారం సాయంత్రం తమ అనుచరులతో కలిసి తిప్ప ప్రాంతంలో ప్రజాభిప్రాయం సేకరణ గ్రామ సభకు టెంట్లు వేశారు. మాకు ముందస్తు సమాచారం లేకుండా గ్రామ సభ నిర్వహించడంపై అధికారులను నిలదీయడంతో ఈ నెల 24వ తేదీ గ్రామసభ జరుగుతున్నట్లుగా ఆంధ్రజ్యోతి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికల్లో ప్రకటన ఇచ్చినట్లు చెప్పారు. దీంతో తీవ్ర ఆగ్రహం చెందిన గ్రామస్తులు ఆ పేపర్లు ఎవరు చూస్తారంటూ, మా ఊరికి ఆ పేపర్లు వస్తాయా? అంటూ ప్రశ్నించారు. గ్రామస్తులకు నోటీసులు ఎందుకు ఇవ్వలేదంటూ ప్రశ్నించారు. అయినా అధికారులు ఇవేవి లెక్క చేయలేదు.

పక్కా ప్లాన్‌తో గ్రామ సభ

మైనింగ్ యజమాని పక్కా ప్రణాళికతో వ్యవహరించారు. ముందుగా నియోజకవర్గంలో అధికార పార్టీ ముఖ్యనేతను ప్రసన్నం చేసుకున్నారు. ఆ తర్వాత స్థానిక అధికార టీడీపీ నేతల ద్వారా ఎస్సీ కుటుంబాలు, ఇతర వర్గాల నుంచి ప్రతిఘటన లేకుండా చూసే బాధ్యత వారికి అప్పగించారు. మైనింగ్‌కు వ్యతిరేకంగా గళం ఎత్తిన వారిని ఏదో రకంగా శాంతింప చేశారు. దీంతో కేవలం పేద వర్గాల జనం మాత్రమే గ్రామ సభకు వచ్చారు. వచ్చిన 15 మంది కూడా 'మైనింగ్ వద్దు మా బతుకులు నాశనం చేయొద్దు' అంటూ కన్నీళ్లతో తమ గోడు అధికారులు ముందు వెలిబుచ్చారు. గ్రామసభ జరిగే ప్రాంతంలో భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. మైనింగ్‌కు వ్యతిరేకంగా గళం విప్పుతారని అనుమానం ఉన్న వారిని నివారించారు. ప్రజాభిప్రాయ సేకరణ సభకు వచ్చిన సబ్‌కలెక్టర్ పేదల గోడు పట్టించుకోలేదు. మైనింగ్ యజమాని సభలో చెప్పిన మాటలకే మద్దతుగా కంటి తుడుపుగా కొన్ని చర్యలు, జాగ్రత్తలు తీసుకొని మైనింగ్ చేసుకోవచ్చు అని సభలో చెప్పి వెళ్లిపోయారు.

మైనింగ్‌పై మంత్రి 'ఆనం' ను నిలదీసిన గ్రామస్తులు



ఆనంకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

వరికుంటపాడు: మండలంలోని జంగంరెడ్డిపల్లి అనుకొని ఉన్న కొండ (తిప్ప)పై మైనింగ్ ప్రయత్నాలు జరుగుతున్న క్రమంలో వరికుంటపాడు గ్రామస్తులు అనుమతులు రద్దు చేయాలని శనివారం రాత్రి మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని అడ్డుకుని నిలదీశారు. రోడ్డు మార్గంలో వరికుంటపాడు నుంచి నెల్లూరు వెళ్తున్న మంత్రి 'ఆనం' కాన్వాయ్‌ను ఆపి వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకొంటామని ఆనం వారికి చెప్పారు. దీంతో కొంత మంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో మంత్రి అసహనం వ్యక్తం చేస్తూ ఇక్కడ చేస్తే ఏమి లాభం గ్రామ సభలో ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. భారీగా పోలీసులను పెట్టి మాట్లాడనివ్వ లేదంటూ చెప్పడంతో పోలీసులున్నా.. నిరసన తెలిపే హక్కు ఉంది కదా అని వెళ్లారు. మీ ఎమ్మెల్యే ముందు నినాదాలు చేయండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మా పొట్ట కొట్టొద్దు



గ్రామంలో పనులు లేక చాలా కుటుంబాలు వలస వెళ్లారు. మా ముత్తాత, తాత కాలం నుంచి తిప్పనే జీవనాధారంగా చేసుకొని పశువులు, మేకలు మేపుకుంటూ, వాటి ద్వారా వచ్చే ఆదాయమే మా పోషణకు దిక్కు. ఇప్పుడు ఎవరో వచ్చి మైనింగ్ చేస్తే మేము ఎలా బతకాలి? మా పొట్ట కొట్టొద్దు. మైనింగ్‌కు అనుమతులు ఇవ్వొద్దు.
– మహేష్, గ్రామస్తుడు

మాకు విషమిచ్చి చంపి మైనింగ్ చేసుకోండి



పూర్వం నుంచి మా గ్రామంలో అనుసంధానంగా ఉన్న తిప్పను ఇప్పుడు ఎవరో వచ్చి వేలంలో మేము కొన్నాము. మేము తవ్వుకుంటామని చెబుతున్నారు. దీనికి మేము పూర్తిగా వ్యతిరేకం. ఈ తిప్పలో మైనింగ్ చేస్తే మా గ్రామం ఖాళీ చేయాలి. మేము ఎక్కడికి వెళ్లి బతకాలి?. అందుకే కాస్త విషం ఇచ్చి మమ్మిల్ని చంపి మైనింగ్ చేసుకోండి
– వెంగయ్య, గ్రామస్తుడు

ప్రజాభిప్రాయ సేకరణకు విలువ లేదా?



తిప్పలో మైనింగ్ చేయడం ద్వారా ఇక్కడ నివాసం ఉంటున్న కుటుంబాలు జీవనం దెబ్బతింటుంది. తిప్పపై ఆధార పడి ఈ పల్లె ప్రజలు బతుకుతున్నారు. ఈగ్రామం అంతా ముక్తకంఠంతో మైనింగ్ వద్దు అని సబ్ కలెక్టర్ ముందు తమ అభిప్రాయాలు తెలిపారు.కానీ ఆమె మైనింగ్ యజమానికి అనుకూలంగా మాట్లాడారు. ప్రజాభిప్రాయంకు విలువ లేనప్పుడు ప్రజాభిప్రాయ సేకరణ ఎందుకు?
– దిలీప్, సర్పంచ్, వరికుంటపాడు

న్యూస్‌రీల్

ప్రసన్నకు ఆదాల పరామర్శ



ప్రసన్నతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఆదాల

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి శనివారం మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని పరామర్శించారు. నగరంలోని సుజాతమ్మకాలనీలోని ప్రసన్న ఇంటిపై జరిగిన దాడి, విధ్వంసం నేపథ్యంలో ఆదాల అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటన జరగడం చాలా దురదుష్టకరమని విచారం వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని ప్రసన్నకు భరోసా ఇచ్చారు. ఆదాల వెంట నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాస్, సీహెచ్ హరిబాబు యాదవ్, ఏసు నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, నాగా శ్రీనివాసులురెడ్డి, స్వర్ణ జీవన్‌ప్రసాద్, షేక్ మొయిద్దీన్, కొండేటి నరసింహారావు, ఆగాల శ్రీనివాసులురెడ్డి, షేక్ అల్లా భక్షు, బెల్లంకొండ వెంకయ్య, శీనయ్య, నాని తదితరులు ఉన్నారు.

పోర్టులో ఒకటో నంబర్ ప్రమాద హెచ్చరిక

ముత్తుకూరు (పొదలకూరు): బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలను జారీ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని కృష్ణపట్నం పోర్టులో శనివారం ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు.

డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లకు అన్ని ఏర్పాట్లు పూర్తి



డిపార్ట్‌మెంటల్ పరీక్షలపై అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ హుస్సేన్‌సాహెబ్

నెల్లూరురూరల్: ఆదివారం నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్‌సాహెబ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో డీఆర్‌ఓ సమావేశం నిర్వహించారు. పొట్టేపాళెంలోని అయాన్ డిజిటల్ జోన్ కేంద్రంలో నిర్వహించే ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్స్‌లో జరుగుతాయన్నారు. కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించే ఈ పరీక్షలకు ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో పరీక్షల లైజన్ అధికారి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

సైనికులకు పొజిషన్ సర్టిఫికెట్లు త్వరలోనే అందజేస్తాం

- విజయ్ దివస్‌లో కలెక్టర్ ఆనంద్



అమరవీరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ

నెల్లూరు రూరల్: పదవీ విరమణ చేసిన సైనికులకు నిబంధనల మేరకు అందించే భూమికి సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్లను త్వరలోనే అందజేస్తామని కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. శనివారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో 26వ కార్గిల్ విజయ దినోత్సవ వేడుకలను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్గి ల్ పోరాటం ఎప్పటికీ మరిచిపోలేని ఘటన అని, దేశ సైనికుల పోరాట పటిమను యావత్ భారతదేశం ఒకే మాట ఒకే బాటగా గుర్తించిన సమయమన్నారు. తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశాన్ని కాపాడిన సైనికుల త్యాగం చిరస్మరణీయమన్నారు. వారి త్యాగ నిరతిని భర్తీ చేయడం అసాధ్యమైనప్పటికీ, వారి కుటుంబాలకు జిల్లా యంత్రాంగం ఎప్పు డూ అండగా ఉంటుందన్నారు. కార్గిల్ పోరాటం జరిగినప్పుడు తనకు 8 ఏళ్ల వయసు అని, ప్రతి రోజు పత్రికల్లో వచ్చే యుద్ధ వార్తలను ఆసక్తిగా చూసే వాడినన్నారు. పదవీ విరమణ చేసిన సైనికులకు నిబంధనల మేరకు అందించే భూమికి సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్స్‌ను త్వరలోనే అందజేస్తామన్నారు. మాజీ సైనికుల కోరిక మేరకు నెల్లూరు నగరంలో అమరవీరుల స్థూపం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు శ్యాం ప్రసాద్, కృష్ణారెడ్డి, తదితరులతో పాటు వివిధ పాఠశాలల ఎన్‌సీసీ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఫ్యామిలీ కలెక్షన్స్‌కు 'లక్కీ' షాపింగ్ మాల్



జ్యోతి ప్రజ్వలనతో లక్కీ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న అనసూయ, రేవంత్, చిత్రంలో మాల్ అధినేతలు

- నటి అనసూయభరద్వాజ్
- నెల్లూరులో నూతన షోరూం ప్రారంభం
- త్వరలో కాకినాడ, తిరుపతిల్లోనూ..
- మాల్ అధినేతలు స్వామి, శ్రీనివాస్, రత్తయ్య

నెల్లూరు (బృందావనం): దక్షిణ భారతదేశంలోనే ఫ్యామిలీ కలెక్షన్స్‌కు లక్కీ షాపింగ్ మాల్ మొదటి స్థానంలో నిలుస్తోందని ప్రముఖ సినీనటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ చెప్పారు. నగరంలో ట్రంకురోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన లక్కీ షాపింగ్ మాల్ 13వ షోరూంను శనివారం అనసూయ బాలనటుడు రేవంత్ (బుల్లిరాజు)తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. భారీగా తరలివచ్చిన తన అభిమానులకు ఓపెన్‌టాప్ కారులో నుంచి అభివాదం చేశారు. మాటమాట కలుపుతూ సెల్ఫీలు దిగుతూ, తాను నటించిన చిత్రాల్లోని పంచ్ డైలాగ్‌లతో హుషారెత్తించారు. అనసూయ మాట్లాడుతూ నెల్లూరు మగువలను ఆకర్షించే ప్రత్యేకమైన అనేక రకాల శారీస్‌ను లక్కీ షాపింగ్ మాల్ అధినేతలు పరిచయం చేస్తున్నారని, ఇది అభినందనీయమన్నారు. బ్యూటీఫుల్ కలెక్షన్స్‌కు కేరాఫ్ లక్కీ షాపింగ్‌మాల్ అన్నారు. క్వాలిటీతో ప్రతి ఒక్కరి బడ్జెట్‌కు అందుబాటులో అద్భుతమైన ఓపెనింగ్ ఆఫర్స్‌ను నెల్లూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అనసూయ చెప్పారు. నిర్వాహకులతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. వారి షాపింగ్ మాల్స్‌ను తానే ప్రారంభించడం మరింత సంతోషం కలిగిస్తోందన్నారు. బుల్లిరాజు (రేవంత్), నా హ్యాండ్స్ లక్కీ హ్యాండ్స్ అని మాల్‌ను ప్రారంభించేందుకు ఇద్దరం కలిసే వస్తున్నామన్నారు. నెల్లూరుకు ఎన్నో పర్యాయాలు వచ్చాను. ఘనంగా స్వాగతం పలికినందుకు నెల్లూరు ప్రజలకు తన అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. రేవంత్ మాట్లాడుతూ నెల్లూరుకు లక్ వచ్చిందని, అందుకే లక్కీ షాపింగ్ మాల్ నెల్లూరులో ప్రారంభమైందన్నారు. లక్కీ షాపింగ్ మాల్ అధినేతలు స్వామి, శ్రీనివాస్, రత్తయ్య మాట్లాడుతూ అనసూయ భరద్వాజ్, బుల్లిరాజుల కాంబినేషన్ లక్కీ కాంబినేషన్ అన్నారు. వారితోనే త్వరలో తిరుపతి, కాకినాడలో మాల్స్ ప్రారంభించనున్నామన్నారు. నమ్మకమైన నాణ్యతతోపాటు అందరి బడ్జెట్ ధరల్లో ఉత్తమ సేవలతో వస్త్రాలను అందించేందుకు జీ+4 ఫ్లోర్లలో లక్కీ షాపింగ్ మాల్‌ను ప్రారంభించామన్నారు. ఎత్నిక్ వేర్ నుంచి ఆధునిక వెస్టర్న్ స్టైల్స్ వరకు అందుబాటు ధరల్లో అదిరిపోయే ఆఫర్లతో వినియోగదారులకు ఆహ్వానం పలుకుతున్నామన్నారు.

ప్రివిలేజ్ కమిటీ సభ్యుడిగా పర్వతరెడ్డి



ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో 2025–26 సంవత్సరం ప్రివిలేజ్ కమిటీ సభ్యుడిగా వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ లెజిస్లేటివ్ కమిటీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

మనీస్కామ్ అంతు తేలుస్తాం

- బాధితులకు అండగా ఉంటా
- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి
- రెండో రోజు మరో బాధిత మహిళ ఫిర్యాదు

కావలి (జలదంకి): కావలి పట్టణంలోని ముసునూరులో జరిగి భారీ మనీ స్కామ్ అంతు తేలుస్తామని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. నష్టపోయిన బాధితుల తరఫున పోరాడేందుకు సమాచార సేకరణ, ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌కు శనివారం మరో మహిళ వచ్చి ఫిర్యాదు చేశారు. ఉలవపాడు మండలానికి చెందిన కత్తి మస్తానమ్మ ఇల్లు కుదువ పెట్టి రూ.4.50 లక్షల నగదు తెచ్చి కట్టి మోసపోయానని ప్రతాప్‌కుమార్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మనీస్కామ్ బాధితులు తన దృష్టికి తెస్తే వైఎస్సార్‌సీపీ తరఫున పోరాటం చేస్తామన్నారు. ఎంతో మంది ఈ మోసగాళ్ల మాయ మాటలు విని ఇళ్లు, ఆస్తులు, బంగారం తనాఖా పెట్టి, అప్పులు చేసి మరీ కట్టి నష్టపోయారని పేర్కొన్నారు.

నీచ రాజకీయాలు మేమెప్పుడూ చూడలేదు



మాట్లాడుతున్న అనూప్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

- రాజకీయ పార్టీల మధ్య విమర్శలు ప్రతి విమర్శలు సాధారణం
- డబ్బుందనే అహంకారంతో ప్రసనన్నపై ఎమ్మెల్యే వ్యక్తిగత విమర్శలు చేశారు
- తిరిగి విమర్శలు చేస్తే దాడులు చేసి ఇంటిని ధ్వంసం చేయడం సబబేనా
- పోలీసుల విచారణ అనంతరం మీడియాతో వైఎస్సార్‌సీపీ నేతలు

కోవూరు: జిల్లాలో ఇలాంటి నీచ రాజకీయాలు తామెన్నడూ చూడలేదు. రాజకీయ పార్టీల మధ్య విమర్శలు ప్రతి విమర్శలు సాధారణమే. కానీ రాజకీయ ప్రత్యర్థిని అంతమొందించాలనుకోవడం అవివేకమని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమంగా నమోదు చేసిన కేసులో శనివారం విచారణ నిమిత్తం రావాలని తమకు నోటీసులు జారీ చేయడం దుర్మార్గమన్నారు. కోవూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ సుధాకర్‌రెడ్డి చేపట్టిన విచారణకు వైఎస్సార్‌సీపీ కోవూరు మండల కన్వీనర్ అత్తిపల్లి అనూప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, రైతు విభాగం నాయకుడు నీలాపరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. వీరిని దాదాపు 2 గంటల పాటు విచారించారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం మీడియా ఎదుట మాట్లాడారు.

తామెన్నడూ తప్పుడు విమర్శలు చేయలేదు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సూచనల మేరకు ఈ నెల 7న నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశం నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ప్రసనన్న మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, తనపై ఆమె చేసిన అనుచిత విమర్శలకు ప్రతి విమర్శలు చేశారన్నారు. ఆమెను విమర్శించడాన్ని జీర్ణించుకోలేక ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై తమ గూండాలను పంపించి ఆస్తి ధ్వంసం చేశారన్నారు. ఈ ఘటనపై ప్రసనన్న పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తే ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. మా నాయకుడిపై విమర్శలు చేశారు. ఆయన ఇంటిని ధ్వంసం చేశారు. తిరిగి మా నాయకుడితోపాటు మాపైనా కేసులు నమోదు చేశారు. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. డబ్బుందనే అహంకారంతో విర్రవీగితే భవిష్యత్ పరిణామాలు అదే స్థాయిలో ఉంటాయని తెలుసుకోవాలన్నారు. తామెప్పుడూ పార్టీ విధివిధానాలకు కట్టుబడి పనిచేస్తామనే కానీ, దిగజారుడు తనంగా వ్యవహరించలేదున్నారు. మాకు న్యాయ వ్యవస్థపై, చట్టపరమైన వ్యవస్థలపై పూర్తి విశ్వాసం ఉందని కేసులు ఎన్ని పెట్టినా నిజం బయట పడుతుందన్నారు.

ఇళ్లపై దాడి దుర్మార్గం



ప్రసన్నకుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పరామర్శిస్తున్న కారుమూరి, చంద్రశేఖర్‌రెడ్డి

- మాజీ మంత్రి కారుమూరి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): 'రాజకీయాన్ని రాజకీయంగా ఎదుర్కోవాలి. విమర్శలకు ప్రతి విమర్శలు చేయాలి. ప్రజాస్వామ్యంలో ఇళ్లపై దాడి చేయడం దుర్మార్గమని' వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్‌రెడ్డి తన ఇంటిపై టీడీపీ గూండాలు చేసిన విధ్వంసాన్ని కారుమూరికి వివరించారు. ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడి దృశ్యాలను చూసి కారుమూరి నివ్వెరపోయారు. నెల్లూరులో జిల్లాలో ఫ్యాక్షన్ తరహాలో దాడులు జరగడం ఇదే ప్రప్రథమన్నారు. ప్రశాంతమైన నెల్లూరు జిల్లాలో ఇలాంటి దాడులు ప్రోత్సహించిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు మంచి పద్ధతి కాదన్న విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలన్నారు.

కాకాణితో కారుమూరి ములాఖత్



జిల్లా సెంట్రల్ జైలు వద నాగేశ్వరరావు, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు

వెంకటాచలం: కూటమి ప్రభుత్వం మోపిన అక్రమ కేసులతో జిల్లా సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో వైఎస్సార్‌సీపీ నెల్లూరు రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు శనివారం ములాఖత్ అయ్యారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో పాటు గోవర్ధన్‌రెడ్డిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. పార్టీ పరంగా కూటమి కుట్రలు ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన వ్యూహాలపై మాట్లాడినట్లు సమాచారం.

క్లుప్తంగా

శ్రామికుల సంఖ్యను పెంచండి


మాట్లాడుతున్న గంగాభవానీ

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పనులకు హాజరయ్యే శ్రామికుల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ గంగాభవానీ ఆదేశించారు. నగరంలోని డ్వామా కార్యాలయం నుంచి ఏపీఓలు, ఈసీలు, టీఏలతో శనివారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. రోజూ లక్ష మంది శ్రామికులకు తగ్గకుండా పనులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. పని జరిగే ప్రదేశం నుంచి ఫొటోలను రెండుసార్లు అప్‌లోడ్ చేయాల్సిందిగా ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ప్లాంటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. జరిగిన పనులకు సంబంధించిన కొలతలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రక్రియకు సంబంధించి ఎఫ్‌ఏలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

'లులు'కు ఆర్టీసీ స్థలమా..?

- ఎన్‌ఎంయూ ఆందోళన



నెల్లూరు సిటీ: విజయవాడ నడిబొడ్డులోని విలువైన ఆర్టీసీ స్థలాన్ని లులు సంస్థకు అప్పగించడం దారుణమని నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు ఆరోపించారు. ఎర్ర బ్యాడ్జీలను ధరించి నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆందోళనను శనివారం చేపట్టారు. నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనను ఆదివారమూ కొనసాగించనున్నామని చెప్పారు. డిపో – 1 అధ్యక్షుడు గౌస్‌బాషా, రామ్‌ప్రసాద్, చెంచయ్య, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న సునీత

వెంకటాచలం: కార్గిల్ అమరవీరుల స్ఫూర్తితో దేశభక్తిని విద్యార్థులు అలవర్చుకోవాలని వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత పేర్కొన్నారు. కాకుటూరు సమీపంలోని వీఎస్‌యూలో శనివారం నిర్వహించిన కార్గిల్ విజయ్ దివస్ వేడుకల్లో ఆమె మాట్లాడారు. ప్రాణాలర్పించిన యుద్ధవీరుల త్యాగాన్ని ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ విజయ, డాక్టర్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ


నెల్లూరు (పొగతోట): శిక్షణ కార్యక్రమాల ద్వారా పూర్తిగా అవగాహన పెంచుకొని.. గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సూచించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో మహిళా జెడ్పీటీసీలు, ఎంపీపీలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమ ముగింపు సందర్భంగా శనివారం ఆమె మాట్లాడారు. ఆర్జీఎస్‌ఏ యాన్యువల్ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి శిక్షణను నిర్వహించామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల రూపురేఖలను మార్చేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని కోరారు. స్టేట్ అబ్జర్వర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను ఆదివారం యథావిధిగా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేయనున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 134
లేయర్ (లైవ్) : 112
బ్రాయిలర్ చికెన్ : 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 264
లేయర్ చికెన్ : 190



పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.26
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ. 5



గిరిజన మహిళలపై రెడ్‌బుక్ రాజ్యాంగం

బంధువుల మధ్య గొడవకు రాజకీయ రంగు

- కరేడులో భూసేకరణపై గళం విప్పడమే కారణం
- ఎమ్మెల్యే ఆదేశాలతో హత్యాయత్నం కేసు నమోదు
- స్టేషన్‌కు అర్ధరాత్రి ముగ్గురి తరలింపు
- అక్రమ కేసు, అరెస్ట్‌కు నిరసనగా ధర్నాతో ఉద్రిక్తత
- వైఎస్సార్‌సీపీ, వామపక్షాలు, ప్రజా సంఘాల మద్దతు


పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన గిరిజనులు, కరేడు రైతులు

ఉలవపాడు: బంధువులైన మహిళల మధ్య జరిగిన చిన్నపాటి గొడవకు రాజకీయ రంగు పులిమారు. ఎమ్మెల్యే ఆదేశించడంతో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పోలీసులు అమలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వేళ మహిళలను పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లి నిర్బంధించారు. దీన్ని నిరసిస్తూ పోలీస్‌స్టేషన్ వద్దకు గిరిజనులు చేరుకొని ధర్నా చేపట్టారు. వీరికి మద్దతుగా కరేడు రైతులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, వామపక్షాలు, ప్రజాసంఘాలు తరలిరావడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. డీఎస్పీతో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి మాట్లాడారు.

జరిగిందిదీ..

మండలంలోని కరేడు పంచాయతీ రామకృష్ణాపురానికి చెందిన లింగనాథం శేషమ్మ తనపై అదే గ్రామానికి చెందిన మానికల శిరీష, మానికల సుజాత, లలితమ్మ దాడి చేశారని శుక్రవారం ఫిర్యాదు చేశారు. వాస్తవానికి వీరందరూ బంధువులే. అయితే వీరి మధ్య జరిగిన గొడవను తన రాజకీయ ప్రయోజనాల కోసం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వాడారు. కరేడులో జరుగుతున్న భూసేకరణకు సంబంధించిన గొడవలా సృష్టించి రాజకీయ రంగు పులిమారు. శేషమ్మపై హత్యాయత్నం చేశారంటూ సదరు మహిళలపై రాత్రికి రాత్రే కేసును పోలీసులు నమోదు చేశారు.

భూసేకరణకు అడ్డుపడతారనే..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు వార్డు సభ్యురాలిగా శిరీష ఉన్నారు. ఈ ప్రాంతంలో భూసేకరణకు ఆమె అడ్డుపడుతుండటంతో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ఎమ్మెల్యే అమలు చేస్తున్నారు. రెండు వాహనాల్లో పోలీసులు వెళ్లి ముగ్గురు మహిళలను శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో తీసుకెళ్లి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, సీపీఎం నేతలు కుమార్, అజయ్ వచ్చి ఉదయం తీసుకొస్తామని చెప్పినా, ఖాకీలు వినలేదు. కేసు నమోదైంది.. రిమాండ్‌కు పంపుతామని తెలిపారు. దీంతో రామకృష్ణాపురం గిరిజనులు కరేడు రైతులకు తెలియజేసి స్టేషన్‌కు వెళ్లి ధర్నా చేయాలని నిర్ణయించుకున్నారు.


పీఎస్‌లో గిరిజన మహిళలు

పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయింపు

రామకృష్ణాపురం గిరిజనులు, కరేడు రైతులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, వామపక్షాలు, ప్రజా సంఘాలు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని ధర్నా చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అక్కడ శనివారం మధ్యాహ్నం వరకు బైఠాయించి నినాదాలు చేశారు. భూములు తీసుకునేందుకు ఇలా అక్రమ కేసులను బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తారానంటూ నిలదీశారు. మహిళలను అర్ధరాత్రి ఇలా తీసుకొచ్చి స్టేషన్లో నిర్బంధించాలని ఏ చట్టం చెప్తోందని ప్రశ్నించారు. అయినా పోలీసులు ఎలాంటి సమాధానం చెప్పకుండా మిన్నకుండిపోయారు. ధర్నా చేస్తున్న వారితో డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు. ఫిర్యాదుదారుతో మాట్లాడితే తక్కువ సెక్షన్లు నమోదు చేస్తామని చెప్పారు.


డీఎస్పీతో మాట్లాడుతున్న జాలిరెడ్డి

ఏడు వరకు రిమాండ్

కనిగిరి కోర్టులో మానికల శిరీష, మానికల సుజాత, లలితమ్మను పోలీసులు హాజరుపర్చారు. దీంతో వారికి ఆగస్టు ఏడు వరకు రిమాండ్ విధించారు. వీరిని ఒంగోలు జిల్లా జైలుకు తరలించారు.

ఇంటూరి.. మీకిది న్యాయమా..?

ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మీకిది న్యాయమానని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదు చేసిన శేషమ్మ సొంత అక్క కుమార్తె శిరీష. వీరిద్దరి మధ్య జరిగిన చిన్న గొడవను పార్టీలకు ఆపాదించి ఇలా చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు శుక్రవారం పర్యటించిన సమయంలో.. తమ భూములను ఇవ్వమంటూ ఈ ముగ్గురు మహిళలు మైక్‌లో మాట్లాడారు. ఈ కారణంతో గ్రామంలోని గిరిజనులను భయభ్రాంతులకు గురిచేయడానికే పోలీసులతో ఇలా నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయించి బెదిరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలా హత్యాయత్నం కేసును ఎందుకు పెట్టారని శేషమ్మను రామకృష్ణాపురం గిరిజనులు శనివారం ఉదయం ప్రశ్నించారు. తాను మామూలుగా కొట్టారనే ఫిర్యాదు చేశానని, తనకేమీ తెలియదని, ఎమ్మెల్యేతో మాట్లాడుకోమని చెప్పడాన్ని చూస్తే రెడ్‌బుక్ రాజ్యాంగం కేసేననే విషయం అర్థమవుతోందని పేర్కొంటున్నారు. ఆధార్ కార్డుల ఈ – కేవైసీ, మార్పులకు సంబంధించి శిరీష ఇంటి వద్దకు శేషమ్మ వచ్చినప్పుడే అసలు వివాదం జరిగింది. దీనికి భూముల వివాదానికి సంబంధం లేదని రామకృష్ణాపురం వాసులు అంటున్నారు. భూసేకరణపై గళం విప్పే వారిపై ఎమ్మెల్యే ఆదేశాలతో కేసును నమోదు చేశారనే అంశం అర్థమవుతోందని కరేడు రైతులు వాపోతున్నారు. ధర్నా అనంతరం శేషమ్మ, ఆమెను రెచ్చగొట్టిన మరో ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు మానికల పద్మ ఫిర్యాదు చేశారు. ఈ కేసును నమోదు చేస్తారో లేదో వేచి చూడాలి.

పోర్టికో కూలి యువకుడి దుర్మరణం

- ఇద్దరికి గాయాలు


భాను(ఫైల్)

తోటపల్లిగూడూరు: పక్కా గృహంలో పోర్టికో కూలి యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని చింతోపులో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యుల వివరాల మేరకు.. చింతోపు దళిత కాలనీకి చెందిన జాగుంట రమణమ్మకు 30 ఏళ్ల నాటి పక్కా గృహం ఉంది. అసంపూర్తిగా ఉన్న దీన్ని తన బాగోగులు చూసిన సమీప బంధువు ఎండ్లూరు శేషమ్మకు ఇచ్చి కొంతకాలం క్రితం మృతి చెందారు. ఈ క్రమంలో శిథిలావస్థకు చేరుకున్న పక్కా గృహానికి మరమ్మతులు చేపట్టాలని శేషమ్మ భావించారు. దీంతో మనవలైన ఎండ్లూరు భాను (28), ఎండ్లూరు నితీష్, ఎండ్లూరు పవన్‌సాయిని పనులకు పురమాయించారు. ఈ క్రమంలో పూరోత్త దెబ్బతిన్న పోర్టికోను తొలగిస్తుండగా, ఒక్కసారిగా నేల కొరిగింది. పెళ్లలు విరిగి పైన పడటంతో పనులు చేస్తున్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. తలకు తీవ్రగాయం కావడంతో ఎండ్లూరు భాను చికిత్స పొందుతూ మృతి చెందారు. మిగిలిన ఇద్దరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు.


ప్రమాదానికి కారణమైన పక్కా గృహం

విషాదఛాయలు

ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంలో మృతి చెందిన భానుకు ఏడాదిన్నర క్రితమే వివాహం కాగా, నెలల వయస్సున్న బాబు ఉన్నారు. భాను తండ్రి ఎండ్లూరు పరంధామయ్య గ్రామంలోని ఓ పంట కాలువలో పడి ఆర్నెల్ల క్రితం మృతి చెందారు. చేదోడువాదోడుగా ఉన్న భాను మృతితో కుటుంబానికి దిక్కులేని పరిస్థితి ఏర్పడింది.

కేంద్ర కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సు

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట సమీపంలో గల జిల్లా కేంద్ర కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సును జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఖైదీల యోగక్షేమాలు, భోజన వసతులు, వైద్య సదుపాయం తదితరాలపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడారు. జైలు జీవితాన్ని గడిపి బయటకెళ్లాక తప్పులను మళ్లీ చేయొద్దని, కుటుంబసభ్యులతో సంతోషంగా జీవించాలని సూచించారు. జైల్లో ఏమైనా సమస్యలుంటే అర్జీల రూపంలో తెలియజేస్తే పరిష్కరిస్తామని చెప్పారు. జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ బాలమహేష్, జైలర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి వాణి

కార్మికుల ఆందోళన



వింజమూరు(ఉదయగిరి): మండలంలోని చంద్రపడియలో గల చిరాన్ కెమికల్ ఫ్యాక్టరీ యాజమాన్యం తమకు పీఎఫ్ ఈఎస్‌ఐను సక్రమంగా జమచేయలేదంటూ, ఆందోళనను కార్మికులు శనివారం చేపట్టారు. ఫ్యాక్టరీలో సుమారు 200 కార్మికులు పనిచేస్తుండగా, వీరిని కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఆరుగురు పంపుతుంటారు. కాంట్రాక్ట్ పొందిన వ్యక్తులు కొంత మొత్తం తీసుకొని వీరికి జీతాలను చెల్లిస్తారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐను ప్రతి నెలా జమ చేయాల్సి ఉన్నా, మూడేళ్ల నుంచి అలా జరగలేదు. ప్రతి నెలా రూ.రెండు వేలను మినహాయిస్తూ.. రూ.నాలుగు లక్షలను జమ చేయకుండా కాంట్రాక్ట్ పొందిన వారు, యాజమాన్యం స్వాహా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. కాగా ఆందోళన చేస్తున్న వారిని యాజమాన్యం బెదిరించడంతో వారు భయంతో విధులకెళ్లారు. ఈ విషయమై యాజమాన్యాన్ని సంప్రదించేందుకు యత్నించగా, ప్రయోజనం లభించలేదు.

లారీ అపహరణ

- కొద్దిసేపటికే స్వాధీనం చేసుకున్న పోలీసులు



మనుబోలు: లారీని ఆగంతకుడు అపహరించిన ఘటన మండల పరిధిలోని కాగితాలపూరు పెట్రోల్ బంక్ వద్ద శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పుణె నుంచి చెన్నై వెళ్తున్న లారీని కాగితాలపూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద డ్రైవర్ బాషా ఆపి విశ్రాంతి తీసుకునేందుకు వెళ్లారు. అదునుగా భావించిన మండలంలోని మడమనూరుకు చెందిన సుమన్ లారీని డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోయారు. గమనించిన డ్రైవర్.. 102కు సమాచారమిచ్చారు. పోలీసులను వారు అప్రమత్తం చేశారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు నిఘా వేసి లారీని ఆపి స్వాధీనం చేసుకున్నారు. సుమన్‌ను అదుపులోకి తీసుకొని మనుబోలు పోలీసులకు అప్పగించారు. విచారణ జరుపుతున్నారు.